క్లుప్తంగా

మాజీ ఎంపీటీసీ నానాజీకి చిన్నశ్రీను పరామర్శ



మెడికవర్ ఆస్పత్రిలో నానాజీని పరామర్శిస్తున్న చిన్న శ్రీను

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుండు నానాజీని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. అస్వస్థత కారణంగా నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతర కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఆయన వెంట జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కోరాడ ముసలి నాయుడు తదితరులు ఉన్నారు.

తీరంలో ఈదురు గాలులు



ఈదురు గాలుల ప్రభావంతో నేలకొరిగిన ట్రీవాల్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తీర ప్రాంతాల్లో శనివారం ఉదయం ఈదురు గాలులు బలంగా వీచాయి. సముద్రంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసి పడుతూ ముందుకు చొచ్చుకుని వచ్చాయి. సాగర్‌నగర్ కూడలి వద్ద ట్రీ వాల్, రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద ఉన్న హోర్డింగ్ నేల కొరిగాయి. తీవ్ర గాలుల ప్రభావంతో రుషికొండ బీచ్‌లో ఉన్న పర్యాటక టూరిజం స్పీడ్ బోట్లను నిలిపివేశారు. మంగమారిపేట, తిమ్మాపురం, ఉప్పాడ, భీమిలి తీరప్రాంత మత్స్యకారులు బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

సీసీ రోడ్లకు భూమిపూజ

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ రాయపాలెంలో రూ.46.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం శిలాఫలకం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి తదితర పథకాలు త్వరలో అమలు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయానికి దివీస్ చేయూత

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం గ్రామ సచివాలయానికి దివీస్ లేబొరేటరీ యాజమాన్యం శనివారం రూ.1.56 లక్షల విలువైన కంప్యూటర్, ప్రింటర్, చెత్త సేకరణ రిక్షాలు, పనిముట్లు అందించింది. సంస్థ సీఎస్‌ఆర్ అధికారి డి.సురేష్‌కుమార్ చేతుల మీదుగా వీటిని సచివాలయ కార్యదర్శి గోపాలకృష్ణకు అందించారు. కార్యక్రమంలో దివీస్ సిబ్బంది ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, సచివాలయ సిబ్బంది మనోజ్, మణి తదితరులు పాల్గొన్నారు.

అనంతుని భక్తుల కోసం బెంచీల వితరణ

పద్మనాభం: పద్మనాభంలోని గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి భక్తుల సౌకర్యార్థం మద్ది గ్రామానికి కంటుబోతు పెద సత్యం, కంటుబోతు రాజన్న(నాయుడు)ల జ్ఞాపకార్థం వారి కుమారులు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, కంటుబోతు నారాయణరావు ఆరు సిమెంటు బెంచీలు అందజేశారు. గిరిపై సిమెంటు రోడ్డు వద్ద వీటిని ఏర్పాటు చేశారు. ఈ బెంచీలు గిరిపైకి వెళ్లిన భక్తులు కూర్చునేందుకు ఉపయోగపడతాయి.

స్వయం ఉపాధి కోర్సుల శిక్షణకు ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ శనివారం తెలిపారు. ఇందులో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, టైలరింగ్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ఎస్.అన్నపూర్ణను 9014758949 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చలికి వణుకుతున్నా.. కటిక నేలపైనే..

వసతిగృహాల్లో విద్యార్థులు సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, బీసీ, సమీకృత హాస్టల్స్ మొత్తం 18 ఉన్నాయి. వీటిలో ఎస్సీ వసతి గృహాల్లో ఎక్కడా మంచాలు లేవు. బీసీ, ఇతర హాస్టల్స్‌లోనూ సరిపడినన్ని మంచాలు లేక విద్యార్థులు నేలపైనే పడుకోవలసిన పరిస్థితి. టాయిలెట్లు సరిగ్గా లేక రాత్రివేళల్లోనూ విద్యార్థులు ఆరుబయట తోటల్లోకి వెళ్లాల్సి వస్తోంది. గోధుమనూక ఉప్మా రుచించక, అందులోనూ చట్నీ కూడా చేయకపోవడంతో విద్యార్థులు సరిగ్గా తినకుండానే పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లిపోతున్నారు. నియోజకవర్గంలోని కొన్ని హాస్టళ్లను సాక్షి విజిట్ చేయగా వెల్లడైన అంశాలివి..

- హాస్టళ్లలో విద్యార్థుల అవస్థలు
- చాలా హాస్టళ్లలో ఫ్యాన్లు కూడా లేని పరిస్థితి
- టాయిలెట్లు అధ్వానం
- కిటికీల అద్దాలు, ఫ్రేములు పగలడంతో కొరవడిన రక్షణ

టాయిలెట్లు సరిగ్గా లేక ఆరుబయటకే..



భీమిలిలోని బీసీ బాలుర వసతిగృహంలో వాష్‌బేసిన్ పరిస్థితి



మురికిపట్టి శిథిలమైన టాయిలెట్

తగరపువలస: భీమిలిలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహం శిథిలం కావడంతో ప్రత్యామ్నాయంగా సంగివలస శివాలయం పక్కన అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.

- ఇక్కడ 45 మంది విద్యార్థులు ఉండగా, వీరికి కూడా ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీలు చెల్లించలేదు.
- ఒక్కోసారి ఉప్మాతో చట్నీ చేయకపోవడంతో వట్టి ఉప్మా తినలేక విద్యార్థులు పస్తులతో తరగతులకు వెళ్తున్నారు.
- రెండే టాయిలెట్లు ఉండి మిగిలినవి వినియోగం లేక, దుర్గంధం వెదజల్లుతుండటంతో చీకటి వేళ కూడా ఇక్కడి విద్యార్థులు ఆరుబయటకు తోటల్లోకి వెళ్తున్నారు.
- సరిపడా ఫ్యాన్లు లేవు. విద్యార్థులే వంతుల వారీగా రూమ్‌లు శుభ్రం చేసుకోవాలి.



ఎస్సీ కళాశాల హాస్టల్‌లో నేలపై పడుకున్న అనారోగ్యంతో ఉన్న విద్యార్థులు

అనారోగ్యంతో ఉన్నా ..

మధురవాడ: మధురవాడ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహాల్లో విద్యార్థులు కటిక నేలపైనే పడుకోవలసి వస్తోంది. అనారోగ్యంతో ఉన్నప్పటికీ ఇదే పరిస్థితి.

- కళాశాల హాస్టల్, సమీకృత బాలల వసతి గృహం రెండింటికీ ఉన్న ప్రహరీ శిథిలమైపోవడంతో పందులు హాస్టల్ గదుల్లోకి చొరబడుతున్నాయి. పక్కనే ఉన్న కాలనీ ప్రజలు చెత్త, చెదారాన్ని ఈ హాస్టల్ పక్కనే పడేయడంతో పరిసరాలు దుర్గంధంతో నిండి ఉంటున్నాయి.
- కళాశాల హాస్టల్‌కు చెందిన గదులన్నింటికీ కిటికీల అద్దాలు, ఫ్రేములు చాలావరకు దెబ్బతిన్నాయి.
- కొమ్మాది గురుకుల సీవోఈలో భవనానికి చెందిన ప్రహరీ ఒక చోట దెబ్బతినడంతో పశువులు, పందులు లోపలికి వచ్చేస్తున్నాయి. బాలికలకు రక్షణ కరువవుతోంది.
- ఇక్కడ తాగునీరు కొరత ఉంది.

పరుపుల్లేని మంచాలపైనే పడక

పద్మనాభం: పద్మనాభం బీసీ బాలుర వసతి గృహంలో మంచాలు ఉన్నా వీటిపై పరుపులు లేవు. దీంతో విద్యార్థులు పడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ వసతి గృహంలో మూడు నుంచి పదో తరగతి వరకు 70 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ వసతి గృహానికి 2018లో 60 మంచాలు ఇచ్చారు. మంచాలు ఇచ్చి ఐదేళ్లు దాటిపోతున్నా పరుపులు సరఫరా చేయలేదు. ఆర్వో ప్లాంటు లేదు. దీని వల్ల విద్యార్థులు సాధారణ విద్యుత్ బోరు మోటారు నీరు తాగుతున్నారు.



పద్మనాభం బీసీ హాస్టల్లో పరుపులు లేకుండా ఉన్న మంచాలు

ఉన్నవి కొన్ని మంచాలే..

- భీమిలిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మంచాలు లేవు. దీంతో విద్యార్థులు నేలమీదే పడుకుంటున్నారు.
- ఎస్సీ, బీసీ బాలికల సమీకృత వసతి గృహంలో 199 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరందరికి సరిపడినన్ని మంచాలు లేక చాలామంది గదుల్లో నేలపైనే పడుకోవలసి వస్తోంది.

– భీమునిపట్నం



వసతి గృహంలో ఉన్న కొన్ని మంచాలు

ఫ్యాన్లు లేక అవస్థలు

తగరపువలస: భీమిలిలోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం శిథిలం కావడంతో తాత్కాలికంగా తాళ్లవలస లెజెండ్ లే అవుట్‌లో 4 ఫ్లోర్లు గల అద్దె అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్నారు.

- ఒక్కొక్క విద్యార్థికి నెలకు రూ.225 వంతున కాస్మొటిక్ చార్జీలు చెల్లించవలసి ఉన్నా ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో ఇంటి నుంచి తల్లిదండ్రులు డబ్బులు పంపించవలసి వస్తోంది.
- వివిధ కళాశాలలకు చెందిన 54 మంది విద్యార్థులు ఇక్కడ ఉన్నారు.
- విద్యార్థులకు సరిపడా ఫ్యాన్లు లేవు.
- విద్యార్థులకు పూర్తిగా జంబుఖానాలు లేకపోవడంతో యోగా మ్యాట్లు, దుప్పట్లు, బొంతలతో నేలపై పడుకుంటున్నారు.
- గోధుమనూక ఉప్మా, శనగపిండి చట్నీ చేస్తే చాలామంది తినడం లేదు. కొందరు పంచదారతో తింటున్నారు. మిగిలినవారు మధ్యాహ్నం కోసం వండిన అన్నాన్నే ఉదయం తింటున్నారు.



తాళ్లవలస లెజెండ్ లేఅవుట్‌లోని హాస్టల్లో ఫ్యాన్లు లేని దృశ్యం

పార్కుల్లో ఆక్రమణల తొలగింపు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. 7 చోట్ల పార్కుల్లో ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన షెడ్‌లను ఏసీపీ తిరుపతిరావు, టీపీవో బాలరాజు, ఇన్‌చార్జి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అప్పలసూరి, మహేష్ తదితరుల ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఏసీపీ మాట్లాడుతూ జోన్ పరిధిలోని 9 వార్డుల్లో 304 పార్కులు ఉండగా, 34 పార్కుల్లో ఆక్రమణలు ఉన్నట్లు నిర్ధారణకు రాగా, 11చోట్ల దేవుడి గుళ్లు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిగిలిన 23 పార్కుల్లో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కొమ్మాది టీచర్స్ లేఅవుట్, అయోధ్యనగర్, కొత్తపాలెం, స్వతంత్రనగర్, కొమ్మాది డీఆర్‌కే రాజు టౌన్ షిప్ తదితర 7 ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించారు. ఈ పనులను జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పరిశీలించారు.



టీచర్స్ లే అవుట్‌లో షెడ్ తొలగిస్తున్న జీవీఎంసీ అధికారులు

సొసైటీ స్థలంలో షెడ్ల తొలగింపుపై అభ్యంతరం

మధురవాడ: కొమ్మాది మాస్టర్ రోడ్డు సమీపంలో ఉన్న సుమారు 2వేల గజాల పార్కులో ఆక్రమణలు తొలగించమని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు ఇస్తే, సొసైటీకి చెందిన స్థలంలో షెడ్లు తొలగించడం ఎంతవరకు సబబని మధురవాడ టీచర్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎస్. విజయరాఘవన్ ప్రశ్నించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. తమ సొసైటీ మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నెం.2పీ, 4పీ లలో షాపింగ్ కాంప్లెక్స్, నర్సరీ స్కూల్ ఇతర అవసరాల కోసం 1.83 ఎకరాలు స్థలం ఉంచుకుని, 20ఏళ్ల కిందటే ప్రహరీలు కూడా నిర్మించామన్నారు. ఈ స్థలానికి ఏటా వీఎల్‌టీ కడుతున్నామని, ఇక్కడ నిర్మాణాల కోసం దరఖాస్తు చేయగా బీఎల్ నంబర్ కూడా అధికారులు కేటాయించారని చెప్పారు. అలాంటి భూమి పార్కు స్థలమని చెప్పి జీవీఎంసీ అధికారులు శనివారం వాచ్‌మన్ గది, కూలీల కోసం ఏర్పాటు చేసిన షెడ్‌ను తొలగించడం అన్యాయమని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని చెప్పారు.

జారిపడుతున్న కొండ చరియలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి ఎస్సీ కాలనీలో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. రాత్రి సమయాల్లో ఓ స్థానికుడు కొండను తవ్వి వదిలివేయడంతో, ఇలా కొండ చరియలు విరిగిపడే పరిస్థితి వచ్చిందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే కొండను తవ్వి స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు సాగించారు. అక్కడితో ఆగకుండా ప్రస్తుతం ఉన్న కొండను కూడా తవ్వేయడంతో ప్రమాదం పొంచి ఉందని ఇక్కడి వారు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న క్రమంలో ఏ క్షణం ఏ జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, ఇష్టానుసారం తవ్వేసే వారిపై చర్యలు తీసుకోవాలని.. కొండ తవ్వకాలను అడ్డుకుని తమ ఇళ్లను కాపాడాలని కోరుతున్నారు.



నివాసాల మధ్య జారిపడ్డ కొండ చరియలు

ఉపాధ్యాయులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

పద్మనాభం: ఎన్నికల్లో ఉపాధ్యాయులకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్.అంబేద్కర్ డిమాండ్ చేశారు. పద్మనాభంలో శనివారం జరిగిన పద్మనాభం మండల యూటీఎఫ్ కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు. 30 శాతం ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలన్నారు. బకాయిలను చెల్లించాలన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం

యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షునిగా ఎంవీవీఎస్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా బోని చిన్నారావు, ఆర్‌వీ నారాయణ, సహాధ్యక్షుడిగా జి.భాస్కరరావు, మహిళా అధ్యక్షురాలుగా జె.కమలాదేవి, ప్రధాన కార్యదర్శిగా జి.సంజయ్‌బాబు, కోశాధికారిగా ఎ.త్రినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చిల్లపేటలో క్షయ నిర్ధారణ పరీక్షలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు చిల్లపేటలో తగరపువలస యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కేంద్రంలో వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటున్న వారితో పాటు టీబీ లక్షణాలు ఉన్నవారి నుంచి కఫం సేకరించారు. కార్యక్రమంలో క్షయ నిర్ధారణ పరీక్షల సిబ్బంది ప్రేమ్‌కుమార్, చక్రవర్తి, శ్రీను, హరి, హారిక, ఆశ కార్యకర్తలు, స్థానిక పెద్దలు చిల్ల భాస్కరరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, జీరు సత్యం తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వందమందికి పైగా నేవీ సిబ్బంది రక్తదానం



కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ఐఎన్ఎస్ కళింగలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్ భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వందమందికి పైగా నేవీ సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు.

ప్రమాణాలు చేసి ప్రజలను నట్టేట ముంచారు

తగరపువలస: 2024 ఎన్నికల ముందు వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలు కొనసాగిస్తూ, సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలు చేస్తామని ఇంటింటికీ బాండ్లు పంపిణీ చేయడమే కాకుండా వాటిపై చంద్రబాబు, పవన్ సంతకాలు చేసి ఇప్పుడు నట్టేట ముంచారని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం మజ్జివలసలో ఆయన స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో కరెంటు బిల్లులు షాక్ కొడుతుండటమే కాకుండా వాతావరణం చల్లబడినా అప్రటిక విద్యుత్ కోతలు తప్పడం లేదన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించిన వైఎస్ జగన్ చెప్పిన సమయానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేర్చారన్నారు. బ్యాంకు రుణాలు కట్టవద్దని వాటిని మాఫీ చేస్తామని, జాబు కావాలంటే బాబు రావాలి వంటి పాత నినాదాలే కాకుండా 50 ఏళ్లకే పెన్షన్, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ వంటివి నెరవేరక ఇప్పటికీ ఈ వాగ్దానాలు ప్రజల చెవుల్లో గింగిర్లు తిరుగుతున్నాయన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ సభలకు వెళ్తే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని కూటమి నాయకులు బెదిరిస్తున్నట్టు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తామన్న సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వాళ్లను మోసం చేయడంతోనే నిలదీయడానికి ఈ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కరపత్రాలలో పొందుపరచిన క్యూఆర్ కోడ్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా చూస్తే జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, కూటమి ప్రభుత్వ మోసాలు తెలుస్తాయని ఇంటింటికీ పంపిణీ చేసిన కరపత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసు రాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, దాట్ల గోపీరాజు, సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కేపీ సత్యనారాయణ, మజ్జి సూరినాయుడు, పొట్నూరు చంద్రశేఖర్, సమ్మిడి శ్రీనివారావు, చిల్ల హరి తోగులు రెడ్డి, తుపాకుల అప్పలస్వామి, అక్కరమాని అప్పలనాయుడు, ఉండబట్ల చిన్నారావు, సురేష్, ఉప్పాడ శ్రీనివాసరావు, మల్లేటి హరి, చిల్ల దేవిచిట్టి, బెల్లాన రామకృష్ణ, గుడ్డాల అప్పలరాజు, వసంత నరసింగరావు, పందిరి గౌరీశ్వరరావు, చెల్లూరి నగేష్, కొయ్య రామకృష్ణారెడ్డి, బొడ్డు దుర్గారావు, మద్దిల శివ, గంధవరపు ఉష, తోట ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.



మజ్జివలసలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను



మజ్జివలసలో సభకు హాజరైన స్థానికులు

భద్రయ్యపేటలో వైద్యశిబిరం



భద్రయ్యపేటలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పద్మనాభం: కిడ్నీ రోగులు ఆహార నియమాలు పాటించాలని కేజీహెచ్ నెఫ్రాలజీ విభాగం ఇన్‌చార్జి డి.రాధా కృష్ణ సూచించారు. మండలంలోని భద్రయ్యపేటలో బీజేపీ వైద్య విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం కోసం కేజీహెచ్‌లో వైద్యులను సంప్రదించాలని సూచించారు. భద్రయ్యపేటలోని తాగునీరులో హెవీ మెటల్స్ ఉన్నాయా లేదా అన్నది రిపోర్టు రావాల్సి ఉందన్నారు. శిబిరంలో 110 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ వైవీఎస్ అనిత, మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం వీఈ రామునాయుడు, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి మణికుమారి రోగులకు పరీక్షలు చేశారు. బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్, మండల అధ్యక్షురాలు టి.నాగమణి పాల్గొన్నారు.

వారిజ నేత్ర విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట దరి వారిజ నేత్ర విద్యాలయం విద్యార్థులు వరల్డ్ స్టెమ్ అండ్ రోబోటిక్స్ ఒలింపియాడ్ (డబ్ల్యూఎస్ఆర్ఓ) రీజనల్ ఛాంపియన్‌షిప్–2025లో ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయి పోటీలో భాగంగా భోపాల్‌లో జరిగిన ప్రాంతీయ డబ్ల్యూఎస్ఆర్ఓ పోటీల్లో క్రుశాంత్, శివశంకర్ సాయి యంగ్ సైంటిస్ట్ కేటగిరీలో మూడో స్థానంలో నిలిచారు. కంటి చూపు కరువైన వారు వ్యవసాయం చేసేందుకు వీలుగా వీరు రూపొందించిన క్రేన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్టు వారిజ నిర్వాహకులు తెలిపారు. గోవర్ధన్, హేమంత్ బ్యాలన్ కారు చాలెంజ్‌లో జాతీయ స్థాయి ప్రవేశానికి ఎంపికయ్యారన్నారు. సంజయ్ రవి, జశ్మిత్ నాన్ లెగో లైన్ ఫాలోయింగ్ రోబోటిక్ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు జాతీయ స్థాయిలో అర్హత పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.



సైంటిస్ట్ కేటగిరీలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు

ఘనంగా పట్టభద్రుల దినోత్సవం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గీతం ప్రాంగణం నుంచి 2024–25 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, లా, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబీఏ, బీబీఎం, బీకాం వంటి కోర్సులు పూర్తి చేసిన 3,377 మంది పట్టభద్రులకు స్నాతకోత్సవ పత్రాలు అందించారు. 136 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు, అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన 48 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పరిశోధన అభివృద్ధి కేంద్రం అధిపతి, సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.నారాయణ్ హాజరయ్యారు. గీతం అధ్యక్షుడు ఎం. శ్రీ భరత్, గీతం వీసీ ఎరోల్ డిసౌజా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి పట్టా అందజేస్తున్న దృశ్యం

మద్యం దుకాణం వద్ద కొట్లాట



మద్యం దుకాణం వద్ద రాళ్లు, బీరుబాటిళ్లతో కొట్టుకుంటున్న యువకులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కూడలి ప్యారడైజ్ మద్యం దుకాణం వద్ద శనివారం సాయంత్రం కొందరు యువకులు పీకల దాకా తాగి రాళ్లు, బీరు బాటిళ్లతో కొట్టుకున్నారు. స్థానికులు విడిపించే ప్రయత్నం చేసినా వెనక్కు తగ్గలేదు. పక్కనే ఉన్న పాన్‌షాపులోకి చొరబడి కూడా ఇష్టానుసారం కొట్టుకున్నారు. ఈ తగాదాలో ఒకరిని బీరు బాటిల్‌తో తల పగలకొట్టగా, మరొకరు రాయితో తలపై మోదారు. రక్తమోడుతున్న వారిని ఫ్రెండ్స్, స్థానికులు ఆస్పత్రికి తరలించారు. స్థానికంగా వీరు బీభత్సం సృష్టించడంతో చుట్టుపక్కల వారు భయాందోళనలకు గురయ్యారు. వీరు స్థానికులా? ఎక్కడి నుంచైనా వచ్చారా అన్నకోణంలో భీమిలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

కొమ్మాది: ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై వినతి

భీమునిపట్నం: భీమిలి తీర ప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ మత్స్యకారుల విభాగ చైర్మన్ అన్నా పొట్టి రజనీకాంత్ తహసీల్దారు రామారావుకు శనివారం వినతిపత్రం అందించారు. పార్టీ మూడో వార్డు అధ్యక్షుడు పొడుగు రామారావు, మత్స్యకారుల నాయకుడు వి.అప్పన్న పాల్గొన్నారు.

లే అవుట్ రిజర్వ్‌లో ఆక్రమణ తొలగింపు

తగరపువలస: భీమిలి జోన్ రెండోవార్డు ఇడదాసరిపేట ఎల్‌పీ నంబర్ 58/2006 లే అవుట్‌లో జీవీఎంసీకి రిజర్వ్ చేసిన ఓపెన్ 49 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్లను టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ జీవీఎంసీ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

డివైడర్‌పై బెంచీలు ధ్వంసం

కొమ్మాది: సాగర్‌నగర్ సచివాలయం ఎదురుగా డివైడర్‌పై గతంలో ఏర్పాటు చేసిన 4 బెంచీలను శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వాకింగ్ చేసి వచ్చి కాస్త విశ్రాంతి తీసుకునేందుకు స్థానికులు కొందరి సహకారంతో సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేశారు. అయితే కొందరు యువకులు ఇక్కడ మద్యం సేవించి వీటిని ధ్వంసం చేశారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.